

అల్లూరి సీతారామరాజు

15, 16 తేదీల్లో విలేకర్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-చింతపల్లి : గ్రామీణ విలేకరుల నైపుణ్యాభివృద్ధికి ఈ నెల 15, 16 తేదీల్లో చింతపల్లి మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామీణ విలేకరులు వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకునేందుకు ఈ తరగతులు దోహదపడతాయన్నారు. 15న పరిశోధనాత్మక జర్నలిజంపై లీడర్ దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి, క్రైమ్ వార్తల్లో మెళుకువలపై ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ బాబీవర్ధన్, భారత రాజ్యాంగం పత్రికా చట్టాలు అంశంపైనా ఎం.శ్రీనివాస రెడ్డి వివరిస్తారని తెలిపారు. 16న సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్ గంజివరపు శ్రీనివాసరావు గిరిజన చట్టాలు రిపోర్టింగ్ అంశంపైనా, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వి.రామారావు పత్రికా భాష అంశంపైనా, సీనియర్ జర్నలిస్టు విజయకుమార్ కృత్రిమ మేధ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అంశంపైనా, సీనియర్ జర్నలిస్టు డి.సోమసుందర్ జర్నలిజం నైతిక విలువలు అంశంపైనా తెలియజేస్తారని పేర్కొన్నారు. ముగింపు సమావేశంలో శిక్షణలో పాల్గొన్న గ్రామీణ విలేకరులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ విలేకరులు వినియోగించుకోవాలని కోరారు.

రాళ్లు తేలిన రోడ్డులో రాకపోకలకు ఇక్కట్లు

- మొంథా దెబ్బకు పూర్తిగా పాడైన రింగు రోడ్డు
- తక్షణ మరమ్మతుల్లో నిండా నిర్లక్ష్యం



మొంథా దెబ్బకు పూతికపుట్టు వద్ద పూర్తిగా పాడైన రింగురోడ్డు

ప్రజాశక్తి- అనంతగిరి : మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు మారుమూల గిరిజన గ్రామాల్లోని మట్టి రోడ్లన్నీ కోతకు గురై రాకపోకలకు వీలులేనంత అధ్వానంగా మారిపోయాయని స్థానికులు అవేదన చెందుతున్నారు. మారుమూల కివర్ల, పెద్దకోట, పిన్నకోట పంచాయతీ పరిధి గ్రామాలకు అనుకుని ఉన్న రింగ్ రోడ్డు దుస్థితి ఇందుకు నిదర్శనమని వాపోతున్నారు. కివర్ల పంచాయతీ గంగవరం నుండి టంగెలబంద, .పూతికపుట్టు, జగడలమామిడి, సట్టకంభ, బొర్రాపల్లేం తదితర గ్రామాలకు ఆనుకుని ఉన్న రోడ్డంతా కోతకు, రహదారి నిండా కాలిబాటలు ఏర్పడడంతోపాటు రాళ్లు తేలి ప్రయాణ సంకటంగా మారాయని స్థానికులు వాపోతున్నారు

పాదచారులు కాలినడకన వెళ్లడానికే వీలు లేనంత అధ్వానంగా తయారైన రహదారిలో బైక్‌లు, ఆటోలు, 108 అంబులెన్స్ మాటమాత్రంగానైనా రాలేనిపరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. మొంథా దెబ్బకు మూడు పంచాయతీల పరిధిలోని రోడ్లన్నీ పూర్తిగాకోతకుగురై పాడవ్వడంతో 12 గ్రామాల గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి, తుపాన్ సహాయక చర్యల్లో భాగంగానైనా ఆయా రోడ్డకు కనీసం మట్టితో పూడ్చి చదును చేయడం ద్వారా తాత్కాలిక రాకపోకలకు వీలుగా తక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. తర్వాత ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన సిసి, బిటి రోడ్ల నిర్మాణంతోపాటు రోడ్డుకు ఇరువైపులా పటిష్టమైన సిమెంట్ కాలువలు ఏర్పాటు ద్వారా ఎంతటి వర్షం కురిసినా రోడ్డు పాడవ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కళాశాల హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థినుల ఆందోళన



ఆందోళనలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను ఎస్ఎఫ్ఐ నాయకులు దృష్టికి విద్యార్థినులు తీసుకెళ్లారు. అనంతరం ఆయా సమస్యలపై కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ విద్యార్థులకు సక్రమంగా భోజనం పెట్టని వార్డెన్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. కాలేజీ, హాస్టల్‌తోపాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా, వాటిపై ప్రశ్నిస్తారనే భయంతో విద్యార్థి సంఘ నాయకులను పాఠశాల, కళాశాల లోపలకు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థి సంఘాల నేతలను అడ్డుకుంటున్న గిరిజన విద్యాశాఖ అధికారి పద్ధతి మార్చుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రిన్సిపాల్‌కు, అధ్యాపకులకు ప్రత్యేక గదులను ఏర్పాటుతోపాటు సైన్సు ల్యాబ్, కాలేజీ ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు.కళాశాలకు అదనపు భవనాలు నిర్మించి విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి కళాశాల, విద్యార్థులకు ప్రత్యేక వసతి భవనాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జీవన్, కష్ణ, మండల నాయకులు అప్పలరాజు, సాయిచరణ్, పవిత్ర పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- పాడేరు/ అనంతగిరి: అనంతగిరి మండలంలోని కార్మికులు, మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.దినేష్ కుమార్‌ను కలెక్టరేట్‌లో కలిసి సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు అనంతగిరి మండలం బీసుపురం కాఫీ పాయింట్ లో 112 మంది గిరిజన కుటుంబాలు 2003 నుండి ఉసిరికాయలు, కరక్కాయలు అమ్ముతూ 2006 నుండి అరకు రోడ్డు ఎపిఎఫ్‌డిసి కాఫీ తోటల వద్ద కాఫీ పాయింట్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల సుంకరమెట్ట కాఫీ పాయింట్‌లో ఉడెన్ బ్రిడ్జి నిర్మాణంతో బీసుపురం కాఫీ పాయింట్ లో ఆగకుండా వెళ్లిపోవడంతో కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసుపురం కాఫీ పాయింట్‌ను టూరిస్టులు ఆకర్షించే విధంగా వ్యూ పాయింట్ నిర్మించాలని, టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఎపిఎఫ్ఇసి అధికారులతో మాట్లాడి , స్వయానా ఆ ప్రదేశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు

ఏజెన్సీ వ్యాప్తంగా పిహెచ్‌సిల్లోని అంబులెన్స్ డ్రైవర్ల జీతాలు పెంచాలని, ఐటిడిఎలో విలీనం చేయాలని, బదిలీలు ఆపాలని కలెక్టర్‌కు విన్నవించారు. అనంతగిరి మండలంలో ఎగువశోభ పంచాయితీ మరదగుడ కాఫీ తోటల నుండి జాముగుడ మీదుగా కమలాపురం నుండి పూలగుడ, ఎగువశోభ పంచాయితీ కేంద్రం 4 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసుపురం కాఫీ పాయింట్ కార్మికులు కొర్ర మోహన్ కుమార్, బాబురావు, రామారావు,సోమేష్,రాజు, అంబులెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరుకు సమస్యలను విన్నవిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ఆటో యూనియన్ చొరవ

- అధ్వాన రోడ్డుకు శ్రమదానంతో మరమ్మతులు




మరమ్మతులు చేస్తున్న ఆటో యూనియన్ ప్రతినిధులు, ప్రజలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలో గతన్‌గూడ జంక్షన్ నుంచి చొంపి జంక్షన్ వరకు 3 కిలోమీటర్ల పొడవున అధ్వానంగా ఉన్న తారురోడ్డుకు ఆటోయూనియన్, స్థానికుల ఆధ్వర్యంలో శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. ఇటీవల వర్షాలకు నిండాపెద్ద గోతులై తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు, స్థానికులు ఎన్నో సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేసి రోడ్డు గుంతలను మట్టితో పూడ్చారు. రోడ్డు ఇరువైపులా ఉన్న జంగిల్ క్లియర్ చేశారు. ఈ రహదారి బస్కి, చొంపి, మాడగడ పంచాయతీ ప్రాంత గిరిజనులకు ప్రధాన మార్గం కావడంతో ప్రతిరోజూ వందలాది మంది వాహన చోదకులు పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం, రోడ్డు, భవనాల శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకొని శాశ్వత రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఇరాగై దొన్ను, సిరగం సాయి కుమార్, యూనియన్ సభ్యులు కిల్లో రాంబాబు, పాంగి యోబు, కిల్లో బంగార్రాజు,వంతల విన్నరాజు, వంతల దాసు పాల్గొన్నారు.

వయ్యారాలు పోతున్న వలిసె పూల అందాలు

- తిలకించి, తన్మయులై పోతున్న ప్రకృతి ప్రేమికులు
- సెల్ఫీలు, ఫొటోలతో సందడి చేస్తూ జ్ఞాపకాలను పదిలపరచుకుంటున్న సౌందర్యారాధకులు



బోడిగపుట్టు వద్ద పసుపు పూల అందాలతో వలిసె పైర్లు

ప్రజాశక్తి - హుకుంపేట: మండల పరిధిలోని రంగశీల పంచాయతీ బోడిగపుట్టు గ్రామం సమీపంలో జాతీయ రహదారి పక్కన వలిసె పూల అందాలు ప్రకృతి ప్రేమికులను, స్థానికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. కనుచూపు మేరలో పసుపు రంగు పూలతో నిండిన ఆకుపచ్చని వలిసె పైర్లు నేలపై తివాచీ పరిచినట్లు గోచరమై కనువిందు చేస్తోంది. ప్రకృతి, సహజసిద్ధ అందాలకు నెలవైన మన్యంలో ప్రస్తుతం సీజన్‌లో పసుపు పూలు విరబూసిన వలిసె తోటలు వలిసెపూల పైర్లు సరికొత్త అందాన్ని తెచ్చిపెడు తున్నాయి. పొద్దుతిరుగుడు వలే నూనె జాతికి చెందిన ఈ పంట నవంబర్, డిసెంబర్ నెలల్లో పసుపుపూలు విరబోసి, మన్యంలో వీచే పిల్ల గాలులకు వయ్యారాలు పోతున్నట్లు అటూఇటూ ఊగుతూ ఈ ప్రాంతీయులతోపాటు మన్యానికి వచ్చే పర్యాటకులు, సౌందర్య ప్రేమికులను చూపు తిప్పుకోనీయకుండా చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. పసుపు పూల అందాలు, వాటిపై వాలే సీతాకోకచిలుకలు, తేనెటీగలు, ఇతర సూక్ష్మ జీవులతో జీవవైవిధ్యాన్ని నింపుతూ కనువిందు చేయడంతోపాటు, వీటి మీదుగా వీసే గాలులు ద్వారా వ్యాప్తిచెందే అదోరకమైన సువాసన ఎలాంటి వారినైనా ఒక్కక్షణం అక్కడ నిలిపి, కట్టిపడేస్తుందంటే అతిశయోక్తి కాదు. వలిసెపూల తోటల వద్దకు వచ్చేసరికి అటుగా వెళ్లేవారు ఒక్కసారి ఆగి వీటిని తనివితీరా ఆస్వాదించడంతో పాటు ఒక సెల్ఫీ, ఫొటో తీసుకుని వాటిని మధుర జ్ఞాపకంగా పదిలపరుచుకుంటున్నారు. ఇదే తోటల్లో అడపా దడపా సినిమా, టీవీ సీరియళ్ల షూటింగ్‌లకు నెలవుగా ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకురాలు కుంజం రాధమ్మ

ప్రజాశక్తి - దేవీపట్నం: కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల శ్రీవాణి డిమాండ్ చేశారు. సిఐటియు రెండో మండల మహాసభ పోసమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకురాలు కుంజం రాధమ్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్ నడిపుడి వెంకటరెడ్డి, కో కన్వీనర్‌గా బంటుమల్లి, నరసింహను ఎన్నుకున్నారు. మరో 25 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.శాంతిరాజు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చెయ్యాలని, సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, కార్మికులందరికీ కనీస వేతనాలు సాధించేవరకు పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. 16,17వ తేదీల్లో రంపచోడవరంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కె.పోసమ్మ, మధ్యాహ్నం భోజనం కార్మికులు యూనియన్ జిల్లా కార్యదర్శి ఏం.రామలక్ష్మి, స్కూల్‌శానిటేషన్ కార్మికులు యూనియన్ నాయకులు ఇళ్ల గంగాభవాని, అంగన్‌వాడి యూనియన్ నాయకులు కోసు బుజ్జమ్మ, అంగన్వాడి, ఆశ వర్కర్స్, వెలుగు యానిమేటర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

అన్నవరం తాత్కాలిక బ్రిడ్జి పనులు ప్రారంభం



అన్నవరం బ్రిడ్జి తాత్కాలిక పనులను పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి -వి.ఆర్.పురం: అన్నవరం బ్రిడ్జి కూలిపోయి ఆరు నెలలు కావస్తున్నా దానికి ప్రత్యామ్నాయ దారిని నిర్మించలేదని మండలంలోని సిపిఎం, వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. స్పందించిన స్థానిక తహసీల్దార్, ఐటిడిఎ పిఒ సారధ్యంలో జిల్లా కలెక్టర్‌ని సంప్రదించి 10వ తేదీన తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ధర్నాను విరమించాలని తెలిపారు. స్పందించిన అఖిలపక్షం ధర్నాను ముగించి బ్రిడ్జి పనులు పదో తేదీన ప్రారంభించక పోతే 11వ తేదీ నుంచి మళ్లీ ధర్నా చేస్తామని కార్యక్రమాన్ని ముగించారు.

జిల్లా కలెక్టర్ ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం తాత్కాలిక పనులను ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, సోయం చినబాబు, ఎంపిటిసి, వైసీపీ మహిళా నాయకురాలు బంధం విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనిమిని లీలా కృష్ణ, సిపిఎం మండల నాయకత్వం పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పోడియం శ్రీరామమూర్తి, గుండుపూడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్, కమ్మిచిచ్చు సత్యనారాయణ, చీరపు తాతబాబు, మోసం చంద్రరావు, ముట్టు గంగరాజు తదితరులు పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. తాత్కాలిక బ్రిడ్జి పనులను చేపట్టడం అభినందనీయమని త్వరలోనే శాశ్వత హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని కోరుతున్నామని అన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం



బాధితులను పరామర్శిస్తున్న జమాల్‌ఖాన్



విఆర్‌పురం: బాధితులకు నగదు అందిస్తున్న విక్టోరియా స్కూల్ సిబ్బంది

ప్రజాశక్తి- ఎటపాక: మండలంలోని మండలం నల్లకుంట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తెల్లం సత్తిరాజు, తెల్లం శ్రీనులకు చెందిన ఇళు అగ్నిప్రమాదానికి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ చైర్మన్ జమాల్‌ఖాన్ దృష్టికి గ్రామస్థులు తీసుకురాగా మంగళవారం ఆయన వచ్చి బాధితులను పరామర్శించి ఇంటి నిర్మాణానికి కావలసిన ఇనుపపైపులు, సిమెంటు రేకులను త్వరలో అందజేస్తానని తెలిపారు. అనంతరం దుస్తులు కొనుక్కునేందుకు బాధితులకు రూ. 5వేలు ఆయన ట్రస్ట్ ద్వారా అందజేశారు. బాధితులు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సాల్మన్‌రాజు, రియాజ్ పాల్గొన్నారు.

ఎస్ఐ చేయూత

ఎస్ఐ అప్పలరాజు సంఘటనా స్థలానికి వచ్చి బాధితులతో మాట్లాడి రూ. 5వేలు నగదు, రెండు బియ్యం బస్తాలు, కొన్ని నిత్యావసర వస్తువులు అందించారు. బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

కొయ్యూరు: కొయ్యూరు మండలం, బకులూరు పంచాయతీలో షార్ట్‌సర్క్యూట్‌కు గురై రాయి దేముడు ఇల్లు గత శనివారం దగ్ధమైంది. జనసేన పార్టీ అరకు పార్లమెంట్, పాడేరు శాసనసభ ఇంచార్జి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య సూచనల మేరకు మండల కమిటీ సలహాతో బకులూరు పంచాయితీ జనసేనపార్టీ అధ్యక్షులు కూడా దేవుడు ఉపాధ్యకులు పోట్టిక రాంప్రసాద్ 23 మంది క్రియాశీలసభ్యులు, గ్రామపెద్దలు మంగళవారం వారిని పరామర్శించారు. 40 కిలోల బియ్యం,5 దుప్పట్లు, దుస్తులు గ్రామపెద్దల చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గోవింద్,బద్రి, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌పురం: మండలంలో రాజుపేట పంచాయతీ సీతంపేటలో ముత్యాల జయలక్ష్మి, కోట్ల రమణమ్మ ఇళ్లు దగ్ధమైన విషయం విదితమే. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను మంగళవారం టేకులబోరు విక్టోరియా మాంటిస్సోరి హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, ఆయాలు వారి వంతు సహాయంగా బియ్యం, కందిపప్పు, నూనె, సబ్బులు, కూరగాయలు మొదలైన నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. ఒక్కొక్క కుటుంబానికి 3,157 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

నేడు టిడిపి ముఖ్యనేతల సమావేశం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజఒమ్మంగిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి మండల టిడిపి ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్టు టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు,ముప్పన కేశవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండల కమిటీ, అనుబంధ కమిటీలు వేయడం జరుగుతుందన్నారు.

నేడు గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు మండలంలోని గృహప్రవేశాలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హౌసింగ్ ఎఇ శ్రీకాంత్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 250 గృహాలు పూర్తయ్యాయన్నారు. పిఎంవైజీ లో106, పిఎం జన్మన్ క్రింద 144 మంజూరైనట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో గృహప్రవేశాలు జరుగుతాయని, మండల స్థాయిలో జడ్డంగి పంచాయతీ, చిన్నయ్యపాలెంలో కార్యక్ర మం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు.

పిఎం జన్‌మన్ పేమెంట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొయ్యూరు: పిఎం జన్‌మన్ పథకంలో భాగంగా పివిటిజి గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వెంటనే పేమెంట్లు మంజూరు చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహిం చారు. తహశీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. మండలంలో 938 ఇళ్లకు గాను కేవలం 240 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ళు నిర్మించుకున్నారన్నారు. వారికి పేమెంట్లు సకాలంలో అందలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.లక్ష, అలాగే ఎన్ఆర్ఆజీఎస్ ద్వారా ఇవ్వాల్సిన పేమెంట్లు కూడా ఇవ్వలేదన్నారు. కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ జిఒ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.సూరిబాబు, తిరుపతిరావు, రమణబాబు, కె.కొండబాబు, సాగిన సంజీవ్, నారాయణ పాల్గొన్నారు.

నిండు ప్రాణం కాపాడిన పిహెచ్‌సి హెచ్‌ఎ



పిహెచ్‌సిలో కన్నమ్మ

ప్రజాశక్తి -విఆర్‌పురం: చిన్నమట్టపల్లి పంచాయతీ వెంకంపాలెం నకు చెందిన బంధం కన్నమ్మ (22) ఐదు నెలల గర్భిణి. మంగళవారం ఉదయం ఆమె హఠాత్తుగా పడిపోవడంతో భర్త సింగయ్య రేఖపల్లి ఆసుపత్రికి ఫోన్ చేయగా హెచ్ఎ కారం రత్తయ్య వచ్చి పరిశీలించి ఆమెకు శ్వాసఆగిపోయినట్టు గుర్తించి వెంటనే సిపిఆర్, మౌత్ టు మౌత్ బ్రీతింగ్ చేశారు. దాంతో ఆమె కోలుకుంది. అనంతరం రేఖపల్లి పిహెచ్‌సిలో చేర్చారు. కుటుంబ సభ్యులు రత్తయ్యకి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి పనుల పరిశీలన



రహదారి పనులు పరిశీలిస్తున్న ఎంపిపి వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలో రహదారి నిర్మాణ పనులను ఎంపిపి గోము వెంకట లక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజవొమ్మంగిలో పురాతన శివాలయానికి రూ. 6లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మా ణం జరిగిందని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, సహకరించిన రాజవొమ్మంగి2 ఎంపిటిసి కనిగిరి గంగదుర్గ, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దరాజులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కింద్ర పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో రూ 3.5.కోట్ల నిధులతో ఎమ్మెల్సీ అనంతబాబు, అప్పటి ఎమ్మెల్యే ధనలక్ష్మి మంజూరు చేసిన ముంజవరపుపాడు, కింద్రా కాలనీ బిటి రహదారి నిర్మాణం కూడా పూర్తి కావడంతో ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాడేరులో జిల్లా డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు ప్రతిపాదన


డ్రగ్ స్టోర్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పాడేరు : పాడేరులో జిల్లా డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ డి కృష్ణమూర్తి నాయక్ వెల్లడించారు మంగళవారం పాడేరులో ప్రస్తుతమున్న సబ్ డ్రగ్ స్టోర్‌ను సందర్శించి ఔషధ నిల్వలు, శస్త్ర చికిత్సల సామాగ్రిని తనిఖీ చేశారు. అన్ని రికార్డులను పరిశీలించారు. డ్రగ్‌స్టోర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిల్వలన్నీ కంప్యూటీకరించి రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. విశాఖపట్నం సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుండి పాడేరు సబ్ డ్రగ్‌స్టోర్‌కు వచ్చిన మందుల నిల్వలను జిల్లాలోని 64 పిహెచ్‌సిల నుంచి వచ్చిన ఆన్‌లైన్ ఇండెంట్ మేరకు సరఫరా చేయాలని సూచించారు. విధిగా రిసిప్ట్ సమర్పించాలన్నారు.

ఎట్టకేలకు తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి- హుకుంపేట: మండల కేంద్రంలోని సిపిఎం కాలనీ, మోదమాంబ కాలనీల్లో తాగునీటి సమస్యపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. రక్షితనీటి పథకం నుంచి కొన్ని వీధులకు కుళాయిలు ఉన్నా పైపులైన్ పాడవ్వడం, మరికొన్ని కాలనీలకు పైపులైన్ లేకపోవడంతో నీటి ఎద్దడి నెలకొనడంపై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేకపోవడంతో, ఇటీవల మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఒలను అడ్డుకుని ముట్టడించి ఆందోళన చేపట్టారు. సమస్య తీవ్రతను విన్నవించి తక్షణ చర్యలుచేపట్టాలని కోరారు.
ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించి, హుకుంపేటలో తాగునీటి ఎద్దడి నివారణకు అత్యవసర నిధులను కేటాయించి గ్రామంలో కుళాయిల పైపులైన్ మరమ్మతు పనులు చేస్తున్నారు. అధికారుల స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ధర్మేంద్ర మాట్లాడుతూ గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, సంబంధిత చట్టాలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తదితర అంశాలపై అంగన్వాడి కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: పార్టీ విధి విధానాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అల్లూరి సామాజిక భవనంలో వైసిపి యువజన విభాగ సమావేశంలో మాట్లాడుతూ. కార్యకర్తలు, నాయకులు వ్యక్తిగత ప్రయోజనాలకు పోకుండా గ్రామస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు స్వార్ధ ప్రయోజనాలకు పోకుండా ఎంతో కొంత ప్రజలకు మేలు చేయాలని సూచించారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాకుండా పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పనిచేసేవాడే నిజమైన కార్యకర్త అని చెప్పారు. అనుభవం కలిగిన సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు రాబోయే రోజుల్లో యువతకు కూడా ప్రోత్సహించే విధంగా ఉండాలన్నారు. ఎవరైనా సరే పార్టీ విధివిధానాలకు కట్టుబడి పనిచేయాలని, వాటిని ధిక్కరిస్తే ఉపేక్షించేది లేదనిస్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ చాణక్య. కార్యదర్శి నాగభూషణం, జిల్లా నాయకుడు కే అశోక్, మండల అధ్యక్షుడు పి పరశురాం,కార్యదర్శి ఎం శంకర్, యువజన విభాగ మండల అధ్యక్షుడు కే విజయదశమి, వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, మాజీ జెడ్‌పిటిసి, సీనియర్ నాయకులు ఎం శ్రీరాములు, సర్పంచ్ జీ నాగేశ్వరరావు, నాయకులు జి సింహాచలం, అశోక్ కార్యకర్తలు ,నాయకులు పాల్గొన్నారు.

గిరిజన యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

రెండు ఎంఎస్ఎంఇల శంకుస్థాపనలో జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : గిరిజన ఉత్పత్తుల ద్వారా ముడి సరుకులు తయారుచేసి గిరిజనులను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరిశ్రమ అభివృద్ధికి చేపట్టే చర్యల్లో భాగంగా జిల్లాలో పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో రెండు ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు ఏర్పాటుకు సిఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం చింతపల్లి గ్రామంలో 15 ఎకరాలోల రూ. 11 కోట్ల వ్యయంతో , రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం ఎట్టపల్లి గ్రామంలో 25 ఎకరాల్లో రూ.13 కోట్లతో రెండు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఎంఎస్ఎంఇ పార్కుల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజస్, విద్యుత్, మంచినీటి సౌకర్యం ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. అరకు మండలం డుంబ్రిగూడ గ్రామంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ అవుట్ లెట్ ఐదు ఎకరాలలో 9 కోట్ల వ్యయంతో 30 యూనిట్లు తో రూపొందుతుందని, మూడు నెలలలో పూర్తవుతుందన్నారు. గిరిజనులందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, సృజనాత్మక అకాడమీ చైర్మన్ గంగులయ్య, జిల్లా పారిశ్రామిక అధికారి ఆర్ వి రమణారావు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజర్ కె.లోహి కుమార్‌పాల్గొన్నారు.

నేటి నుంచి న్యుమోనియా వారోత్సవాలు

డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 12న ప్రపంచ న్యుమోనియా దినోత్సవం, 18 వరకుఅవగాహన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ, ఇతర శాఖలు, అంగన్వాడి, ప్రభుత్వేతర సంస్థల సమన్వయంతో న్యుమోనియాపై అవగాహన ర్యాలీలు, నిరోధక చర్యలు చైతన్య శిబిరాలను నిర్వహించాలని ఆరోగ్యకేంద్రాల పరిధిలోని వైద్యఆరోగ్యసిబ్బందికి నిర్దేశించినట్లు వెల్లడించారు. తీవ్రమైన శ్వాస సంబంధిత వ్యాధి న్యుమోనియా ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులతోపాటు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వ్యాప్తిచెందే అవకాశం ఉంటుందన్నారు.కాలానుగుణంగా బాక్టీరియా, వైరస్ లేదా ఫంగస్ ద్వారా సంభవించే న్యుమోనియా వ్యాధి ముఖ్య లక్షణాలు జ్వరం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది, ఛాతీ నొప్పి మొదలైనవి ఉంటాయని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఏటా న్యుమోనియాతో లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. న్యుమోనియా మరణాల నివారణకు సకాలంలో వ్యాక్సినేషన్ శుభ్రత పాటించడం, పిల్లల్లో పోషకాహారం మెరుగుపరచడం అవసరమన్నారు. న్యుమోనియా నివారణకు యూనివర్సల్ ఇమ్యునేషన్ ప్రోగ్రాం, మిషన్ ఇంద్రధనుష్ వంటి పథకాల ద్వారా పిల్లలకు టీకాలు ఉచితంగా వేస్తున్నామన్నారు. వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులు, ఆరోగ్యకేంద్రాలను సంప్రదించి చికిత్స పొందడం ద్వారా ప్రాణప్రమాదం నివారించవచ్చున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన

స్పందించకుంటే 17న సచివాలయం ముట్టడి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పంచాయతీ గొడుగురాయి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్వర్యం లో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ గొడుగురాయి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గతంలో ఆందోళన చేపడితే, వైసిపి ప్రభుత్వం హయంలో రూ. 49 లక్షలతో గ్రావెల్ రోడ్డు మంజూరు చేశారని, అయితే కాంట్రాక్టర్ అశోక్ రెడ్డి అరకొర పనులు చేసి పూర్తి చేయకుండా వదిలేసారు. ఇప్పుడు మళ్లీ బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ అశోక్‌రెడ్డిపైనా, పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే ఈనెల 17న సచివాలయ ముట్టడి చేస్తామని, అప్పటికీ మేలుకోకుంటే చలో కలెక్టరేట్ ముట్టడి తప్పదని హెచ్చరించారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని కించమండ గ్రామ సచివాలయాన్ని డిఎల్‌డిఒ జయప్రకాశరావు మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన పలు సమస్యలను స్థానిక ఎంపిటిసి జి.చిరంజీవి, డిఎల్‌డిఒ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు.. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసి సీడ్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

గైర్హాజరైన సచివాలయ సిబ్బందిపై చర్యలు

ప్రజాశక్తి- పాడేరు: గతవారం హాజరు నమోదు చేయని, సమయపాలన పాటించని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సచివాలయాల సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా వివిధ శాఖల అధికారులతో వర్చువల్‌గా సమీక్ష సమావేశం నిర్వహించారు. పెన్షన్ పంపిణీలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. పెన్షన్ పంపిణీ పూర్తయిన తరువాత మిగిలిన మొత్తాన్ని సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. అర్హత ఉండి పెన్షన్ పొందని వారు జిల్లాలో ఉండకూడదని, దీనిపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. స్వయం సహాయక రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, మొండి బకాయిల వసూలుకు అవసరమైతే ఆర్ఆర్ యాక్ట్ అమలు చేయాలన్నారు. అర్హులకు రుణాలు మంజూరు చేసి ప్రోత్సాహించాలన్నారు.. గ్రామ, వార్డ్ సచివాలయాల ద్వారా నిరుద్యోగ యువత సమాచారం సేకరించి , వారికి అభిరుచి ఉన్న రంగాలలో మండలాల వారీగా నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామ , వార్డు సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించి, విధులను సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇకెవైసి, ఆధార్ సీడింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఐటిడిఎ పిఒల నిరంతర పర్యవేక్షణలో పిఎం జనమన్, పీఎం గ్రామీణ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంగన్వాడీలకు తాగునీరు కల్పించాలని , మరుగుదొడ్లు, శాశ్వత భవనాలు నిర్మించాలని, భవనాలకు మరమ్మత్తులు చేపట్టాలని ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ హర్‌ఘర్ జల్‌లో భాగంగా జిల్లాలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా త్రాగునీరు అందించాలన్నారు. హై రిస్క్ గర్భిణులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒలు తిరుమణి శ్రీ పూజ, స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ నాగేశ్వరరావు, డిఆర్‌డిఎ పిడి. వి.మురళి, సిపిఒ పి.ప్రసాద్ , జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వి రమణారావు, జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణంరాజు, డ్వామా పిడి ఎల్ .సీతయ్య, డిపిఒ పి.ఎస్. కుమార్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో 11598 గృహాల ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా 12న బుధవారం రాష్ట్రంలో మూడు లక్షల గృహప్రవేశాలు జరుగనున్నాయని, అందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11,598 గృహాలు ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. పాడేరు నియోజకవర్గంలో వంతాడపల్లి పంచాయతీ సప్పిపుట్టు, అరకువాలీ నియోజకవర్గం కొత్తబల్లుగూడ పంచాయతీ సిమిలిగూడ, రంపచోడవరంలో అడ్డతీగలలో నియోజకవర్గ స్థాయిలో ఇళ్ల ప్రారంభోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఇళ్ల ప్రారంభోత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు.

పిఎంఎవై 2.0కు ఆన్‌లైన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: నిరుపేద గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంఎవై 2.0 పథకం కింద ఇళ్లు మంజూరుకు అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇఇ కృష్ణమూర్తి కోరాఉ. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పిఎంఇవై 2.0 పథకానికి ఈనెల 31 వరకు గడువు ఉందని, ఇల్లులు లేకుండా అర్హులైన లబ్ధిదారులు ఉంటే ఈ నెలలోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారికి ఎల్‌పిసి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డ్ ,జాబ్ కార్డ్, లబ్ధిదారుని పాస్ ఫోటో, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌తోపాటు ఫోన్ నెంబర్, వ్యక్తిగత వివరాలను జతపరచాలని కోరారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో మండల కేంద్రంలోని బాలికలు, బాలుర ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులను తనిఖీ చేసి, ఉపాధ్యాయుల విద్యాబోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు భోజన మెనూ అక్రమంగా పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ గిరి విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-పాడేరు : దేశానికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని, విద్యావ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమని శ్రీ పూజ, డిఆర్ఒ కె.పద్మలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ : మండల కేంద్రంలోని శాఖ గ్రంతాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక లైబ్రేరియన్ ఎస్.సునీత తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14న గ్రంథాలయ పతాకావిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, 16న చిత్రలేఖన పోటీలు, 17న వ్యాసరచన పోటీలు, 18న మ్యూజికల్ చైర్స్ పోటీలు, 19న పాటల పోటీలు, 20న ముగింపు రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ధారకొండ మండల కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దారకొండ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశామని మండల సాధన కమిటీ సభ్యులు సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో ధర్మ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధారకొండ మండల కేంద్రం ఏర్పాటు చేస్తే సీలేరు, ధారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు.ఏ.దారకొండ పంచాయతీ పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సాలూరులో ఆమె నివాసంలో సాధన కమిటీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. మంత్రి సంధ్యారాణి సానుకూలంగా స్పందించారని ధారకొండ మండల కేంద్ర ఏర్పాటుకు గల ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జగన్ బైశెట్టి సుందరరావు, రాంబాబు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- రంపచోడవరం : డివిజన్ పరిధిలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ మంగళవారం పరిశీలించారు. రంపచోడవరం ప్రభుత్వ హైస్కూల్, లెనోరా హైస్కూల్, ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాల, ముసురుమిల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాల తదితర కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ ప్రహరీలు, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులను పరిశీలించి, లోపాలు ఉన్న చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత హెచ్‌ఎంలను ఆదేశించారు. సి,డి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కచ్చితమైన ప్రణాళికతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ- 1 లక్ష్మీ శ్రీనివాస్, ఎంఇఒ 2 లక్ష్మీ నరసింహారావు, మారేడుమిల్లి ఎంఇఒ 2 ముత్యాలరావు, శారపు చిన్నిబాబు దొర, హెచ్‌ఎంలు బాలరాజు, ఝాన్సీరాణి, ఎ. జగన్, బి. అన్నమణి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి శ్రీలంకలో నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్లో పాల్గొని మంగళవారం కళాశాలకు తిరిగి విచ్చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. డాక్టర్ విజయభారతి మాట్లాడుతూ విద్యారంగంలో నూతన పద్ధతులపై చర్చలు జరిగాయని తెలిపారు.

జల్, జంగిల్, జమీన్ కాపాడడమే బిర్సా ముండాకు నిజమైన నివాళి

- జయంతి ఉత్సవాల్లో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు



బిర్సాముండాకు నివాళులర్పిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



బిర్సా ముండా జయంతి వేడుకల్లో పాల్గొన్న ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి- పాడేరు :ఆదివాసీ పోరాట, స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా 150వ జయంతి మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనరస, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలో బ్రిటిష్, స్వదేశీ భూస్వాముల కింద బానిసలుగా ఉన్న ఆదివాసీల కోసం బిర్సాముండా పోరాడారన్నారు. నీరు, అడవి, భూమి ఆదివాసీల హక్కు అని, ఆదివాసీ ప్రాంతంలో స్వయంపాలన కావాలని గొప్ప ఆశయం కోసం పోరాడి, చిన్న వయసులోనే తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. నేడు బిర్సాముండా జయంతిని 'ఆదివాసీల ఆత్మగౌరవ దినోత్సవం'గా కేంద్రప్రభుత్వం నిర్వహిస్తూ మరోవైపు ఆదివాసీల అటవీ సంపద భూములను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. పాడేరు ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టు పేరిట అదానీ, నవయుగ కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల ఆదివాసీల భములను కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు సాగిన ధర్మాన్నపడాల్, జిల్లా నాయకులూ లక్కు, నర్సయ్య, కృష్ణారావు, దాస్, సూర్యనారాయణ ఎంఎం శ్రీను చిట్టిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బిర్సాముండాను ప్రతి గిరిజనుడు గుర్తుంచుకోవాలి

రంపచోడవరం : గిరిజన హక్కుల కోసం, గిరిజన భూముల కోసం పోరాటం చేసిన బిర్సాముండాను ప్రతి గిరిజనుడు గుర్తుపెట్టుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా ఏజెన్సీలో వివిధ పాఠశాలల విద్యార్థులతో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు ఉట్టిపడేలా మాక్ పార్లమెంటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలో ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ బిర్సా ముండా జయంతి ఉత్సవాలు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారి పి.అంబేద్కర్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, సహాయక గిరిజన సంక్షేమ శాఖాధికారి గుడ్ల తులసీదాస్, బుడమల మంగిరెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమ్మె ఉధృతం

సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగింపు
సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్



నినాదాలు చేస్తున్న కాఫీ కార్మికులు

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ కార్మికుల సమ్మె ఉధృతమైంది. కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం ప్రవర్తనను సిఐటియు తీవ్రంగా తప్పుపట్టింది. గత సంవత్సరం చేసిన అగ్రిమెంటులో పేర్కొన్న హామీలు ఈ ఏడాది కూడా మాటలకే పరిమితమయ్యాయని ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం పలు ఎస్టేట్లలో సమ్మె చేస్తున్న కార్మికులను సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కోరికలపై 'చూస్తాం, చేస్తాం, నివేదిక పంపించాం" అనే మాటలకే పరిమితమైందని విమర్శించారు. కరువు భత్యం, విడిఎ పాయింట్లకు అనుగుణంగా కూలి రేట్లు, పండ్ల రేట్లు పెంచుతామని హామీ ఇచ్చినా, ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పలేదని మండిపడ్డారు. పర్మినెంట్ కార్మికులు నివసిస్తున్న క్వార్టర్ల పరిస్థితి దయనీయమని, వర్షాలు వస్తే ఇళ్లు కూలిపోతున్న స్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్, ప్లాంటేషన్ కండక్టర్ల నియామకం, హెల్పర్ల పదోన్నతి వంటి అంశాలపై సంవత్సరాలుగా వాయిదా వేస్తున్నారన్నారు. ఒక్కో వర్క్ అసిస్టెంట్ 75 హెక్టార్ల తోటల బాధ్యత వహించాల్సి వస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో తోటల సంరక్షణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. చర్చలు అర్ధవంతంగా జరగలేదని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్.సుందరరావు, కార్యదర్శులు రాజుమోరి వెంకటగిరి, మాజీ అధ్యక్షులు ఎన్.కనకవల్లి, రాజారావు, ఆర్ముగం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.సత్యనారాయణ, వెంకటేష్, నాగేశ్వరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులు లక్ష్మయ్యకు నివాళి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని కుంజవారిగూడెంలో సిపిఎం సీనియర్ నాయకులు కుంజ లక్ష్మయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు, కాగా మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులతో పాటు మండల ఎంపిపి కారం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి లక్ష్మయ్య ఎంతో కృషి చేశారని కుంజవారిగూడెంలో ఏ సమస్య ఉన్నా ముందుండి పోరాటం చేసి పరిష్కరించేవారని ఆయన స్ఫూర్తితో అంతా పనిచేయాలన్నారు.


రహదారి పనులు చేస్తున్న గిరిజనులు

శ్రమదానంతో రహదారి బాగుచేసి..

ప్రజాశక్తి-జీకే వీధి : ఎవరో వస్తారని ఎదురుచూడకుండా వారే తమ గ్రామానికి రహదారి వేసుకున్నారు మండలంలోనీ గుర్రాలగొంది గ్రామస్తులు. వర్షాల కారణంగా పెద్ద పెద్ద గుంతలు పడడంతో అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. మంగళవారం గ్రామస్తులంతా కలసి తాత్కాలికంగా రహదారి పనులు నిర్వహించారు. శాశ్వతప్రాతిపదికన రహదారి నిర్మాణం చేయాలని వారు కోరుతున్నారు.

వర్క్ అసిస్టెంట్‌పై కాఫీ పండ్ల దొంగల దాడి

- యాజమాన్యం స్పందించకపోవడంపై సిఐటియు ఆగ్రహం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి డివిజన్ పరిధిలోని చేరుకుంపాకల ఎస్టేట్‌లో ఆదివారం రాత్రి కాఫీ పండ్ల దొంగలు వర్క్ అసిస్టెంట్ వెంకటేష్‌పై దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. సుమారు రాత్రి 11 గంటల సమయంలో నలుగురు దొంగలు 100 కిలోలకుపైగా పండిన కాఫీ పండ్లను నాలుగు కవర్లలో సేకరించి తీసుకెళ్తుండగా, సమ్మె కొనసాగుతున్నప్పటికీ తోటల రక్షణ కోసం వెళ్ళిన వెంకటేష్ టార్చ్‌లైట్ పట్టి పరిశీలించగా, దొంగలు మూటలను వదిలేసి పారిపోయారు. తర్వాత ఆ పండ్ల మూటలను తీసుకువచ్చే ప్రయత్నం చేసిన వెంకటేష్‌పై మళ్లీ తిరిగి వచ్చిన దుండగులు రాయితో దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో వెంకటేష్ కుడిజెబ్బ కింద భాగంలో గాయమై, ప్రస్తుతం మెడ తిప్పుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై యాజమాన్యం ఇప్పటికీ స్పందించకపోవడం దురదృష్టకరమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటల రక్షణ కోసం కింద స్థాయి సిబ్బందిని నియమించాలనే తమ డిమాండ్‌ను యాజమాన్యం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. వెంకటేష్‌కు తక్షణ వైద్య సహాయం, వైద్య ఖర్చులు అందించాలని డిమాండ్ చేశారు.